క్లుప్తంగా

నేడు కమిషనర్ భావన బాధ్యతల స్వీకరణ



నూతన కమిషనర్ భావనకు స్వాగతం పలుకుతున్న కమిషనర్ వెంకటరావు, అధికారులు

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి భావన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల సమయంలో ఆమె విధుల్లో చేరనున్నారు. ప్రస్తుత కమిషనర్ వెంకటరావు స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా మంగళవారం రాత్రి కాకినాడ చేరుకున్న ఆమెకు కమిషనర్ జె.వెంకటరావు, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరావు ఇతర అధికారులను ఆమెకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, పలువురు డీఈలు, ఏఈలు కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ వీరీష తదితరులు

కాకినాడ రూరల్: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లను సద్వినియోగించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీపీ బందిలి వీరీష పేర్కొన్నారు. మండలం రమణయ్యపేటలోని ఏపీఎస్‌పీ పాఠశాలలో నిర్వహించిన స్టూడెంట్ కిట్ల పంపిణీకి ప్రిన్సిపాల్ గాయత్రి అధ్యక్షత వహించగా ఎంపీపీ వీరీష ముఖ్య అతిథిగా, జనసేన పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ తాటికాయల వీరబాబు విశిష్ట అతిథిగా, జనసేన పార్టీ నాయకులు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ కె.సత్యనారాయణ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.శ్రీనివాస్, ఇంటర్మీడియెట్ ఇన్‌చార్జి కందుకూరి పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ స్మార్ట్ సిటీ క్లబ్ నూతన కార్యవర్గం



రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావును సత్కరిస్తున్న స్మార్ట్‌సిటీ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ స్మార్ట్ సిటీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రతిష్ఠానోత్సవం స్థానిక రోటరీ క్లబ్‌లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, గౌరవ అతిథిగా రాజీవ్ గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకట్రావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సామా భాస్కర్ పాల్గొన్నారు. 2024–25 సంవత్సరానికి అధ్యక్షుడిగా పోతుల రాంజీ, కార్యదర్శిగా నామాడి స్వామి శేఖర్‌తో ఇతర సభ్యులతో ముఖ్య అతిథులు ప్రమాణస్వీకారం చేయించారు. సుమారు 160 సార్లు రక్తదానం చేసిన అనుసూరి మోహన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు సామంతుల అజయ్ కుమార్, సభ్యులు కె. సూర్యనారాయణ, జి.రోజా, టి.రవి పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం

కాకినాడ సిటీ: కాకినాడలోని రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. అధ్యక్షునిగా నల్లమిల్లి బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్‌గా తాడి ఆదిరెడ్డి, భవన సాధన కమిటీ చైర్మన్‌గా నల్లమిల్లి మాచారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నల్లమిల్లి సత్తిరెడ్డి, ఉపాధ్యక్షునిగా మల్లిడి అబ్బాయిరెడ్డి, ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్‌గా పడాల శ్రీవెంకటరామారెడ్డి, యూత్ సర్వీస్ సెక్రటరీగా నల్లమిల్లి గణేష్ సత్య వెంకటరెడ్డిలతో పాటు 49 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం రెడ్ల కోసం ఏర్పాటు చేసుకున్నది కాదని, రెడ్లతో ఏర్పాటు చేయబడి బడుగు బలహీన వర్గాలకు కుల, మతాలకు అతీతంగా పలు సేవా కార్యక్రమాలు చేయాలనే దృక్పథంతో ఏర్పాటు చేసినదన్నారు. ఆరేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

లైసెన్స్ లేని ప్రయాణం

- నిర్లక్ష్యం వహిస్తున్న వాహన చోదకులు
- స్పెషల్ డ్రైవ్ పెడితే వక్కతోవలో పలాయనం
- చిక్కుతున్న వారిలో యువకులే అధికం
- సులభతరం చేసినా లైసెన్స్ పొందడంలో ఉదాసీనత



వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు (ఫైల్)

బాలాజీచెరువు: కాలం వేగంగా పరుగెడుతోంది. పనిలోనూ వేగం పెంచాల్సిన పరిస్థితి అనివార్యమైపోయింది. ఇందుకు మనిషీ పరుగులుపెడుతున్నాడు. ఓ పనితో ఇంకో పని అనుబంధంగా మారుతున్న తరుణంలో కాలచక్రంతో పాటు మనిషీ కాళ్లకు చక్రాలు కట్టుకుని తిరగాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లో వాహనం లేనిదే ఇంటిలోంచి అడుగుపెట్టలేని పరిస్థితి తలెత్తుతోంది. కరోనా కాలం నేర్పిన పాఠాల్లో ఒకటి వ్యక్తిగత దూరం. సాధ్యమైనంత వరకు దీనిని పాటించడానికే అందరూ ప్రయత్నిస్తున్నారు. ఇందుకు కూడా అందుకోసం అందరికీ వాహనం అనివార్యమైపోయింది. వాహనం ఎంత సౌకర్యమో దానిని సరిగా నిర్వహించకపోయినా, నడపలేకపోయినా కొన్ని సందర్భాల్లో ప్రాణం మీదకు తేవడమో, ప్రాణాలు తీయడమో అకస్మాత్తు ఘటనల్లా జరిగిపోతుంటాయి. పోలీసు శాఖ పదే పదే మాధ్యమాల ద్వారా, వారోత్సవాల ద్వారా హెల్మెట్ల గురించి, లైసెన్స్‌లేని ప్రయాణాల గురించి ఎన్ని హితోక్తులు చేసినా చాలా మంది పెడచెవిన పెడుతున్నారు. ఎవరూ ట్రాఫిక్ నిబంధనలు కానీ, డ్రైవింగ్ నిబంధనలు కానీ పాటించడం లేదు. పదో తరగతి పూర్తయిన వెంటనే ఇంటర్మీడియెట్ లేదా పాలిటెక్నిక్ కళాశాలలో చేరడం.. వెనువెంటనే తల్లిదండ్రులను బైక్ కొనివ్వమని గొడవపెట్టి మరీ బైక్‌తో కళాశాలకు రావడం నేడు పరిపాటైంది. వాహనం నడపడంలో సరైన శిక్షణ లేకుండానే, రహదారి నిబంధనలు తెలియకుండానే రోడ్డుమీదకు వచ్చేయడం ప్రమాదాలకు కారణమవడం నిత్యం అందరూ చూస్తున్నవే. సరైన శిక్షణ తీసుకుని లైసెన్స్ పొంది మన, పరుల ప్రాణాలకు అపాయం కాని విధంగా వాహనం నడిపితే ఏ సమస్యా రాదు. అలా కాని పరిస్థితుల్లో ఆకతాయితనంగా వాహనం నడిపితేనే ఎందరికో నష్టం. రవాణా, పోలీస్‌శాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న సమయంలో పట్టుబడుతున్న వారిలో అధికశాతం విద్యార్థులే కావడం గమనార్హం. రూ.వేలు, లక్షలు వెచ్చించి వాహనాలు కొంటారు కానీ లైసెన్స్ తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తూ ఇక్కట్లు తెచ్చుకుంటున్నారు. జరిమానాలు వేస్తే చెల్లించేస్తున్నారు కానీ మళ్లీ మామూలైపోతున్నారు. అలాగే ఆన్‌లైన్ పేమెంట్ చెల్లింపుల విషయంలోను నిర్లక్ష్యం చూపుతున్నారు.

కాకినాడ ఆర్‌టీఏ పరిధిలో

లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్‌లు	6,23,134
మోటార్‌సైకిల్ విత్ గేర్	9,04,854
విత్ అవుట్ గేర్	20,783
రెన్యువల్ చేసుకోనివారు	2,3905
ద్విచక్రవాహనాలు	13,67249
కార్లు	1,04201

జరిమానాతో పాటు జైలు



డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపడం అత్యంత ప్రమాదకరమే కాదు నేరం కూడా. పోలీసుల సహకారంతో రవాణాశాఖ ఆర్‌టీఏ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తోంది. అలాగే ప్రభుత్వం లైసెన్స్‌ల జారీ ప్రక్రియను సులభతరం చేసింది. చాలా మంది లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవడం లేదు.

– ఎ.మోహన్, జిల్లా రవాణాశాఖాధికారి

ద్విచక్ర వాహనాలే అధికం..

రవాణాశాఖ పరిధిలో అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించినా లైసెన్స్ లేని వారికి సుమారుగా రూ.5 వేలు జరిమానా విధిస్తున్నారు. అయినా కొందరిలో ఏమాత్రం మార్పు రావడంలేదు. నగర పరిధిలోని ఆర్‌టీఓలో పరిధిలో దాదాపు 1.50 లక్షల ద్విచక్ర వాహనాలు ఉండగా కేవలం లైసెన్స్‌లు మాత్రం 50 వేలకు దాటి ఉండకపోవడం గమనార్హం.

జరిమానాలకు స్పందించరు

వాహనచోదకుల్లో మార్పు తీసుకురావడానికి ఇటు పోలీసులు, అటు రవాణాశాఖ అధికారులు ఎల్ఎల్ఆర్ శిబిరాలు, రహదారి భద్రతావారోత్సవాలు నిర్వహిస్తునే ఉన్నారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధిస్తున్నా 60 శాతం మంది ఫైన్ కట్టడం లేదు. రోడ్డుప్రమాదాలకు కారణమౌతున్న వారిలో లైసెన్స్ లేనివారే అధికంగా ఉన్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థమౌతుంది.

భవనం పైనుంచి పడి బెంగాల్ వాసి మృతి



అబ్దుల్ బరి ఎస్‌కే

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ రమణయ్యపేట 2వ డివిజన్‌లోని ఫ్రెండ్స్ కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం వద్ద పశ్చిమ బెంగాల్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు అబ్దుల్ బరి ఎస్‌కే (27) మంగళవారం ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు భవన నిర్మాణంలో పనిచేస్తున్న అబ్దుల్ బరి రెండో ఫ్లోర్‌లో పని చేస్తూ మెటీరియల్ అందించే క్రమంలో జారి నేలపై పడిపోయాడు. వెంటనే అతడిని సర్పవరం జంక్షన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన జకారియా ఎస్‌కే ఫిర్యాదు మేరకు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. కాగా సమాచారం అందుకున్న తరువాత ఆయన నిర్మాణంలో ఉన్న భవనం వద్దకు వెళ్లి పరిశీలించి గాయపడిన అబ్దుల్‌కు మెరుగైన వైద్యం అందేలా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతుడి బంధువులు పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా సంతోష్‌పూర్‌లో ఉన్నారని, బరితో పాటు అతడి తమ్ముడు, పలువురు పశ్చిమ గోదావరి జిల్లా వాసులు కాకినాడలో పనిచేస్తున్నారు.

పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం



స్వచ్ఛత వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పెనుగుదురు ప్రాథమిక పాఠశాల వద్ద వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

కాకినాడ రూరల్: ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని నోడల్ అధికారి జీవీఎస్ఎన్ కుమార్ పేర్కొన్నారు. బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద నుంచి స్వచ్ఛత వారోత్సవాలలో భాగంగా ర్యాలీ జరిగింది. అనంతరం ఉద్యానవనంలో పరిశుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెల చివరి వారం స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహిస్తూ పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అడబాల రత్న ప్రసాద్, దాసరి శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహించాలి

కరప: ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం ప్రతి గ్రామంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహించాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. నడకుదురు, పెనుగుదురు, వేములవాడ తదితర గ్రామాల్లో పర్యటించి స్వచ్ఛత వారోత్సవాల నిర్వహణను పరిశీలించి గ్రామ కార్యదర్శులకు సూచనలిచ్చారు. వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఖాళీ ప్రదేశాలలో, ఆసుపత్రి, బస్‌స్టాప్‌ల వద్ద, రోడ్లపై నిర్మాణ, కూల్చివేసిన వ్యర్థాలను తొలగించడం, డ్రెయిన్లలో పూడికల తొలగింపు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని గ్రామకార్యదర్శులు పి.బ్రహ్మానందం, బి.చంద్రకళ, పి.వీరభద్రరావు, కేశవరావు, పి.శ్రీనివాస్, ఎం.భవాని. పి.ఉమామహేశ్వరి తదితరులు స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహించారు.

చంద్రశేఖర్ ఆజాద్, తిలక్‌లకు ఘన నివాళి



చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్‌లకు నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ, అధ్యాపకులు

కాకినాడ రూరల్: స్థానిక నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో స్వాతంత్ర్య సమర యోధులు చంద్రశేఖర్ ఆజాద్, లోకమాన్య బాలగంగాధర్ తిలక్‌ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంత శ్రీ అధ్యక్షతన జరిగిన సభలో వారి చిత్రపటాలకు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతి శ్రీ మాట్లాడుతూ భారత స్వతంత్ర సంగ్రామంలో విప్లవకారులలో చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ చెప్పుకోదగిన వ్యక్తులుగా పేర్కొన్నారు. వారి నుంచి ప్రతి విద్యార్థి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా దేశం కోసం పోరాడగలిగే ధైర్యాన్ని, సమాజం పట్ల ప్రేమను, నిబద్ధతని, బాధ్యతాయుతంగా ఉండే వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.పోచయ్య, డాక్టర్ స్టీఫెన్, డాక్టర్ అజయ్ రతన్ తదితరులు పాల్గొన్నారు.

భావనారాయణుని దర్శించిన మహారాష్ట్ర భక్తులు



భావనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో కూర్చున్న భక్తులు

కాకినాడ రూరల్: మండలం సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామిని మహారాష్ట్రకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో మంగళవారం దర్శించుకున్నారు. పిఠాపురంలోని శ్రీపాద వల్లభ సంస్థానం, పాదగయ క్షేత్రంలోని దత్తాత్రేయుడి దర్శనం కోసం వచ్చిన వారంతా అక్కడ నుంచి సర్పవరం వచ్చారు. పురాతన విష్ణు క్షేత్రాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

కుటుంబ సభ్యులతో కలిసి నిరసన

సామర్లకోట: రాక్ సిరామిక్స్ నుంచి తొలగించిన కార్మికులు స్థానిక ఏడీబీ రోడ్డులోని ఫ్యాక్టరీ గేటు ఎదురుగా కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి కార్మికులను తొలగించి 99 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు వారికి న్యాయం చేయలేదని ఆరోపించారు. తొలగించిన కార్మికులకు ఇంటి అద్దెలు కట్టుకోలేని పరిస్థితి ఏర్పడటంతో భార్యా పిల్లలో రోడ్డు మీదకు వచ్చారని తెలిపారు. ఆందోళనకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్సు యూనియన్ అధ్యక్షుడు చింతల సత్యనారాయణ, పెయింటింగ్ వర్కర్సు యూనియన్ అధ్యక్షుడు గూనూరు రమణలు మద్దతు తెలిపారు.

ఆరుగురు జూదరులపై కేసు నమోదు

కరప: మండలం పెనుగుదురులో ఆరుగురు జూదరులపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ టి.రామకృష్ణ మంగళవారం రాత్రి తెలిపారు. పెనుగుదురు రామాలయం వద్ద పేకాడుతున్న సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడిచేశారు. అక్కడ పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ 5,050 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కాకినాడ కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఏపీకి నిధుల కేటాయింపుపై హర్షం

కరప: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యమిచ్చి, వరాలజల్లు కురిపించడంపై రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పడాల రఘు హర్షం వ్యక్తంచేశారు. మండలం నడకదురులో మంగళవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కమిషనర్‌కు ఆత్మీయ వీడ్కోలు



కమిషనర్ వెంకటరావును సత్కరిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు, అధికారులు, ఉద్యోగులు

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావుకు అధికారులు, ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్తున్న ఆయనను స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సభలో పలువురు అధికారులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఆయన అందించిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉద్యోగులను సమన్వయం చేస్తూ పరిపాలనపరంగా అనేక సంస్కరణలు అమలు చేస్తూ ప్రతి అధికారి, ఉద్యోగిలో ఆత్మస్థైర్యాన్ని నింపేలా ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ కాకినాడ రిటర్నింగ్ అధికారిగా, కార్పొరేషన్ కమిషనర్‌గా సంతృప్తికరమైన సేవలు అందించగలిగానన్నారు. విధి నిర్వహణలో తోటి అధికారులు, ఉద్యోగులు చక్కని సహకారం అందించారన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరావును ఉద్యోగులంతా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, ఏవో శిరీష్, వివిధ విభాగాధిపతులు, డీఈలు, ఏఈలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి..

- అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం
- నియోజకవర్గంలో విస్తృత పర్యటన
- ఆస్పత్రుల్లో వసతులపై ఆరా
- పాఠశాలల్లో విద్యా బోధనపై సూచనలు



సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం పొందిన వారి నుంచి సమాచారం సేకరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్



జి.రాగంపేట జగనన్న కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దాపురం/సామర్లకోట: పెద్దాపురం మండలంలోని పులిమేరు పీహెచ్‌సీ, అంగన్‌వాడీ పాఠశాలలను కలెక్టర్ పరిశీలించి విద్య, వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఐసీడీఎస్ ద్వారా అందుతున్న సంక్షేమ ఫలాలపై ఆరా తీసి తల్లులు, గర్భిణీ, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు. అలాగే కాండ్రకోట ఏలేరు దబ్బ కాలువ నిర్మాణంపై చేపట్టాల్సిన పురోగతిని సమీక్షిస్తూ రైతుల సమస్యలు అడిగి తెలుసుకు దబ్బ కాలువ నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి విద్యా విధానం, వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా బోధన సాగాలని ఆయన అధికారులకు సూచించారు. అలాగే నియోజకవర్గ పరిధిలో ఉత్తమ సేవలు అందిస్తున్న సిబ్బంది అభినందించారు. ముందుగా పెద్దాపురం శివారు జి.రాగంపేట జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి తాగునీటి సరఫరాపై ఆరా తీసి జీఎల్ఆర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ జేఎస్ రామారావు, జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ, డీపీఓ భారతి సౌజన్య, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పి.సరిత, ఎంపీడీఓ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామర్లకోట మండలంలో..

సామర్లకోట మండలం పలు గ్రామాల్లోని పలు కార్యాలయాలు, యూనిట్లు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వాటి నిర్వహణపై ఆరా తీశారు. సామర్లకోట మండలం అచ్చంపేటలో వర్మీ కంపోస్టు యూనిట్‌ను పరిశీలించి నిర్వహణ విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం కల్యాణ మండపం వద్ద ఉన్న తాగునీటి ట్యాంకు ఇన్‌లైన్ క్లోరినేషన్ ఫార్ములాను ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను అడిగి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఉండూరులోని జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలించి ఉత్తీర్ణతా శాతాన్ని హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, డీఈఓ పి.రమేష్, ఎంఈఓలు వై.శివరామ కృష్ణయ్య, పి.వుల్లయ్య, మండల ప్రత్యేకాధికారి పి.రాధాకృష్ణ, ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్, ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణసత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ తనిఖీ..

అనంతరం కలెక్టర్ స్థానిక సీహెచ్‌సీని పరిశీలించి ఆస్పత్రి ఇన్‌చార్జి ప్రమీలను రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులను పలకరించి వసతులు బాగున్నాయా అని ప్రశ్నించారు. మందుల కొరతనూ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కెనాల్ రోడ్డులోని హుస్సేన్‌పురంలో ఉన్న గోదావరి కాలువలో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించారు. అలాగే వేట్లపాలెం పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టరు శ్రీహిమవతి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, తహసీల్దార్ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో కలెక్టర్ పూజలు

ఈ సందర్భంగా పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో కలెక్టర్ షాన్ మోహన్ పూజలు చేశారు. ఆయనకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ పండితులు వేదాశీర్వచనం చేసి, స్వామివారి ప్రసాదం, ఫొటో అందజేసి ఆలయ చరిత్రను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా భక్తుల సమస్యలను సైతం వివరించగా ఆయన లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఈఓకు సూచించారు.

టెంట్ హౌస్ సప్లయర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

సామర్లకోట: టెంట్ హౌస్ సప్లయర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుతున్నట్టు జిల్లా సంఘ అధ్యక్షుడు సంగిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక అన్నపూర్ణ కల్యాణ మండపంలో పట్టణ యూనియన్ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా యూనియన్ సమావేశం జరిగింది. సంగిశెట్టి మాట్లాడుతూ టెంట్ హౌస్ యజమానుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టెంట్ హౌస్ సప్లయ్ యజమానులు సంగిశెట్టి శ్రీనివాసరావు (కాకినాడ)ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మేకా శ్రీనివాసరావు (సామర్లకోట), కార్యదర్శి నూకల ఉదయ భాస్కరరావు (కాకినాడ రూరల్), కోరాకుల రామకృష్ణ (జగన్నాథపురం), సహాయ కార్యదర్శిగా మాధవరపు రామకృష్ణ (కాకినాడ రూరల్), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పిల్లాడి రామ కృష్ణ, సుంకర చిట్టిబాబు, గారపాటి శివ, కె శ్రీను ఎన్నిక అయ్యారు.